అడుగడుగునా ఆక్రమణలు

- కుంచించుకుపోతున్న రోడ్లు
- సింగ్‌నగర్‌లో ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



సింగ్‌నగర్ దాబా కొట్లు సెంటర్‌లో సర్వీసు రోడ్డును ఆక్రమించిన వ్యాపారులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కాదేదీ ఆక్రమణలకు అనర్హం అన్నట్లుగా ఉంది సింగ్‌నగర్ ప్రాంతంలోని పరిస్థితులు. రోడ్డు మార్జిన్లు, డ్రెయినేజీలు, సర్వీసు రోడ్లను కొందరు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో రోడ్లు కుంచించుకుపోయి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ట్రాఫిక్ కష్టాలు

సింగ్‌నగర్‌లోని డాబా కొట్లు సెంటర్, ఇందిరా నాయక్ నగర్, సర్వీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో షాపుల యాజమానులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు.

మరికొందరు రోడ్ల మార్జిన్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ నుంచి రైల్వే ఆర్‌యూబీ వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పైన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు రామకృష్ణపురం నుంచి డాబా కొట్లు సెంటర్ వరకు సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు. కాని రోడ్డు మొత్తం ఆక్రమణలతో నిండిపోవడంతో ఈ సర్వీసు రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల కొద్ది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి.



నివాసితులు తమ వాహనాల పార్కింగ్ కోసం మార్జిన్లు ఆక్రమించిన వైనం



రోడ్లపైనే ఉన్న భవన నిర్మాణ సామగ్రి

నిబంధనలు పాటించని వ్యాపారులు

కొంత మంది వ్యాపారులు నిబంధలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించుకుని శాశ్వత నిర్మాణాలు చేపట్టి యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొందరు బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకోగా, స్థానికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు రోడ్డును ఆక్రమించుకుని తమ ఇళ్లకు ర్యాంపులను ఏర్పాటు చేసుకున్నారు. ఇంకొందరు కాలువలను పూర్తిగా మూసివేసి వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. ఎంకే బేగ్ స్కూల్, రైతు బజారు రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏకంగా డ్రెయినేజీపైనే హోటల్స్ నిర్వహిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు నెలకొంటున్నాయి. పాదచారులు నడిచేందుకు కూడా దారి లేకుండా ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించి షాపులు ఏర్పాటు చేశారు. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుద్ధ్య సమస్య

అనధికారిక ఆక్రమణలతో ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రమవుతోంది. వ్యాపారులు సైడు డ్రెయినేజీలను ఆక్రమించుకోవడంతో పాటు దుకాణాలలోని వ్యర్థాలను డ్రెయినేజీల్లోనే వేస్తున్నారు. దీనితో మురుగునీరు పారుదల కావడం లేదు. డ్రెయినేజీల ఆక్రమణతో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు సిల్ట్ తొలగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపై పారుతోంది. స్థానికులు మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంటోంది. డ్రెయినేజీల్లో మురుగునీటి పారుదల లేకపోవడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

సింగ్‌నగర్ ప్రాంతంలో రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను వెంటనే తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రమాదకర కేబుల్ వైర్లు తొలగించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపించినా, అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి ఒక వారం రోజుల్లోగా వాటిని తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ నగర సుందరీకరణలో భాగంగా నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించి, అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని ఆదేశించారు. ఈ నిబంధనను అమలు చేయకపోతే వారం తర్వాత వీఎంసీ అధికారులు చర్యలు చేపడతారన్నారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ పేద ముస్లింలకు అండగా ఉంటుందని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. శనివారం కండ్రిక కార్యాలయంలో కమిటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. అనంతరం 42వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ కాలేషా ఆధ్వర్యంలో మైలవరం నియోజకవర్గానికి చెందిన షేక్ కరిష్మా, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మొహమ్మద్ షఫీ ఉల్లాకు 9వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, ఎండీ రఫీ, ఎండీ ఆరిఫ్, నాగుల్‌మీరా, ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర దినోత్సవం

విజయవాడ కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి తెలిపారు. శనివారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో యోగాసనాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా యోగాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ పి. రోహిత్, ధర్మప్రచార పరిషత్ సభ్యులు బి. వెంకట బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో దాతలు గోయాజ్ సిల్వర్ జ్యూయలరీ, లాడియా జ్యూయలరీస్ ఆధ్వర్యంలో 300 మంది భక్తులకు శనివారం అన్నప్రసాదం అందించారు. తొలుత పద్మావతి సమేత శ్రీనివాసులుకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం కార్యక్రమంలో 2025లో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా 575 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చిన సాయి అక్షయను అభినందించారు. 550 మార్కులు సాధించిన విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఎంఈఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాత షఫీవుల్లాకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, రక్తదాత ఎస్‌కే షఫీవుల్లాకు ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేశారు. షఫీవుల్లా ఇప్పటి వరకు 48 సార్లు రక్తదానం చేయడంతో పాటు అవసరమైన సమయంలో స్నేహితులతో కలిసి రక్తదానం చేయిస్తున్నందుకు గానూ ఆయనకు సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. షఫీవుల్లాను ట్రస్ట్ సభ్యులు నాగమల్లీశ్వరి, బి. వసంతకుమార్ అభినందించారు.

పద్య నాటక వైభవాన్ని చాటిన హరిశ్చంద్ర నాటకం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, జయంతి నాట్య మండలి సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళా వేదికపై శనివారం ప్రదర్శించిన సత్య హరిశ్చంద నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, మహాకవి జాషువా రచించిన నాటకాన్ని నటీనటులు పాత్రోచితంగా నటించారు. సత్యమే వ్రతంగా నియమం కలిగిన హరిశ్చందుడు ఇచ్చిన మాట కోసం సమస్త రాజ్యాన్ని వదులు కోవడం, చివరకు భార్యబిడ్డలను కూడా అమ్ముకోవవం, కాటి కాపరిగా మారటం అంశాలుగా నాటకం సాగింది. హరిశ్చంద్రునిగా జి. లక్ష్మయ్య, వివేకానంద స్వామి, నక్షత్రకునిగా శివయ్య నాయుడు, చంద్రమతిగా రమణి నటించారు. మహాకవి జాషువా రచించిన కాటిసీను పద్యాలు కరతాళ ధ్వనులందుకున్నాయి.

19న దాసాంజనేయ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయం హుండీ కానుకల లెక్కింపు ఈనెల 19న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 9 గంటలకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, సేవా సంఘం సభ్యుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చని చెప్పారు.

యోగాతో జీవనశైలి మార్పు



పాయకాపురంలో ఆసనాలు వేస్తున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు



బీఆర్టీఎస్ రోడ్డులో యోగా చేస్తున్న దృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): యోగాసనాలు కేవలం వ్యాయామం కాదని, జీవనశైలి మెరుగు పర్చే సాధనం అని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పాయకాపురం, న్యూ రాజీవ్ నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు ఔట్ పేషెంట్లతో కలిసి యోగాసనాలు వేశారు. ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఏజీవీ సాయిప్రసాద్, సమన్వయకర్తగా వ్యవహరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ భానునగర్ సెంటర్‌లో శనివారం యోగాంధ్ర అవగాహన కార్యక్రమం జరిగింది. 28వ డివిజన్ స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వరి యోగా విశిష్టతను వివరించారు. వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ కొత్తూరు నాగేశ్వరరావు యోగా సాధన చేయించారు. 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచనేని లలిత, వార్డు సచివాలయం అడ్మిన్ నాగార్జున, సౌజన్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

■ మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం యోగాంధ్ర అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి యోగా ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ 11 కేవీ మ్యూజియం రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజియం రోడ్డు, కస్పా వారి వీధి, హాస్పిటల్ రోడ్డు, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు , ప్రకాశం రోడ్డు, దుర్గయ్య వీధి, సివిల్ కోర్టులు ఏరియా, గోపాలరెడ్డి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నీట్-2025 పరీక్షలో చైతన్య విద్యార్థులకు ర్యాంకులు



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నీట్-2025 పరీక్ష ఫలితాల్లో విజయవాడ విభాగంలోని తమ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి పలు కేటగిరీల్లో ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బి.ధీరజ్-8వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), పి.అవినాష్-15వ ర్యాంకు (ఓబీసీ కేటగిరి), టి.శివమణిదీప్ 24వ ర్యాంకు (ఓబీసీ కేటగిరి), పి.త్రివిక్రమ్-57వ ర్యాంకు (ఓబీసీ కేటగిరి), బి.కుముద-61వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), కె.ప్రిన్స్ శశి కిరణ్-98వ ర్యాంకు (ఎస్సీ కేటగిరి) పొందారని మురళీకృష్ణ చెప్పారు. ఆలిండియా కేటగిరిలో 26 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించారన్నారు. విజయవాడ విభాగంలోని తమ విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులు 1,600 మందికిపైగా మెడికల్ సీట్లు సొంతం చేసుకునే ర్యాంకులు పొందారని చెప్పారు. తమ విద్యా సంస్థలో అవలంబిస్తున్న వైద్య, ఎలైట్, ఎయిమ్స్-సూపర్-60 వంటి ప్రోగ్రామ్స్ వల్లనే ఈ విధమైన ర్యాంకులు సాధ్యమైందని వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, డీన్స్, ప్రిన్సిపాల్‌ను మురళీకృష్ణ అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బేబీ రాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీ రాణి అన్నారు. ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీసీ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ ఇంజినీరింగ్ పేరుతో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల పరిస్థితి మరలా మొదటికి వచ్చిందన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ పదవులు బీసీలకు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో జన గణనతో పాటు బీసీ కుల గణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుంచి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పోస్టు కార్డుల ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేస్తామన్నారు. త్వరలోనే ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి శ్రీకాంత్, నిడుముక్కల సాంబశివరావు, పాటూరి శ్రీనివాసరాజు, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పోలంపల్లి రాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, తన్నీరు శ్రీను, యాదాద్రి తదితరులు పాల్గొన్నారు.

సప్త శనివారార్చనలు ప్రారంభం



పూజలు అందుకుంటున్న మహావిష్ణువు



లబ్బీపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గణేష హోమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయవాడ కల్చరల్: దుర్గాపురం శివరామ కృష్ణ క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏడు శనివారాల పాటు నిర్వహించే అర్చనలు శనివారం ప్రారంభమయ్యాయి. మహావిష్ణువుకు పూజలు నిర్వహించారు. 10 వేల మల్లెపూలతో స్వామి వారికి అర్చనలు జరిపారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

కంచి కామకోటిపీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా అర్చక స్వాములు గణపతి హోమం నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామి వారి శేష వస్త్రాలు అందించారు. దేవాలయ మేనేజర్ శర్మ, కార్యక్రమం ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ సి.రామ్మోనరావు పాల్గొన్నారు.

గురుబ్రహ్మ, గురుశిరోమణి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురుపౌర్ణమిని పురస్కరించుకుని వివిధ రంగాల్లోని గురువులను గుర్తించి వారిని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ, గురు శిరోమణి పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన గురువులు వారు అందిస్తున్న సేవల వివరాలతో తమ దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబర్ 1-20-164, పోస్టు, తిరుమలగిరి, గోకుల్ నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్- 15కు పంపించాలని కోరారు. మరింత సమాచారం కోసం సెల్: 9652347207 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

గృహోపకరణాలు అగ్నికి ఆహుతి



ఇంటిలో ఎగసిపడుతున్న మంటలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఏసీలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఓ ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కృష్ణలంక పాత పోస్టాఫీస్ రోడ్డులోని ఒక గ్రూప్ హౌస్ మొదటి అంతస్తులో తాతా సాంబశివరావు తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను గవర్నర్‌పేటలో ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం అతను ఇంటిలో ఏసీ ఆన్ చేసుకుని నిద్రపోయాడు. పని మీద బయటకు వెళ్లిన అతని భార్య సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి రాగా ఏసీ అవుట్ డోర్ నుంచి మంటలు రావడాన్ని గమనించి ఇంటిలో నిద్రపోతున్న భర్తను లేపింది. వెంటనే అతను బయటకు పరుగులు పెట్టాడు. ఒక్కసారిగా మంటలు ఇల్లంతా వ్యాపించి సీలింగ్‌కు అంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలో సోఫాసెట్‌తో పాటు విలువైన వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు పైఅంతస్తుకు వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగిందని, లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లిందని పోలీసులు, అగ్నిమాపక అధికారులు తెలిపారు.

జూలై 12న సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

సచివాలయ ఉద్యోగుల జేఏసీ



సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో జూలై 12న సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ నిర్వహించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నిర్ణయించింది. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ సమావేశం జరిగింది. జేఏసీ నాయకులు వి. శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతినేలా కూటమి ప్రభుత్వం చర్యలు ఉన్నాయన్నారు. డోర్ టు డోర్ సర్వేల పేరుతో ఊపిరిసలపకుండా పని భారం మోపుతున్నారని చెప్పారు. కనీసం సర్వేకు నిర్దిష్ట సమయం కూడా ఇవ్వకుండా ప్రతిదీ అర్జెంట్ అన్నట్లు చేయిస్తున్నారన్నారు. ఏడాదిగా సచివాలయ ఉద్యోగులంతా మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్ల విషయంలోనూ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రధాన డిమాండ్లు సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు, సర్వీస్ నిబంధనలు, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు, ప్రమోషన్లు, అంతర్ జిల్లా బదిలీలు, సొంత మండలంలో ఉద్యోగం చేసుకుని వెసులుబాటు కల్పించాలనే డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జూలై 12న విజయవాడలో జరుగనున్న ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభకు 10వేల మందికి పైగా ఉద్యోగులు తరలివస్తారన్నారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జి. జోసెఫ్, కిశోర్, టి.కోటేశ్వరరావు, టి ప్రభాకర్, ఎం. రాజ్యలక్ష్మి, టి. దుర్గాప్రసాద్, పి. నరసింహారావు, అప్పికట్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 'ఆపరేషన్ బుడమేరు' అమలు చేయాలి

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే 'ఆపరేషన్ బుడమేరు' అమలు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. బుడమేరును ప్రక్షాళన చేయాలని, ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్ వద్ద శనివారం సీపీఐ ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లా సమితుల ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరిగింది. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన దీక్షలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, 'ఆపరేషన్ బుడమేరు' హామీ ఇచ్చి 10 నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి. దుర్గాభవాని, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటి రామ్మోహన్‌రావుకు నివాళి

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో కర్నాటి రామ్మోహనరావు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన్‌రావు న్యాయవాది అయినప్పటికీ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. దేశం నలుమూలలా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రిటైర్డ్ హైకోర్టు రిజిస్ట్రార్ తల్లా వేణుగోపాలరావు రామ్మోహన్‌రావు సేవలను కొనియాడారు. సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు, బార్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కండ్రికలో పాదయాత్ర



మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కండ్రికలో పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోసపూరితంగా గృహాలలో అదానీ విద్యుత్ మీటర్లు బిగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 64వ డివిజన్ నేతాజీ సుభాస్ చంద్రబోస్ నగర్ (కండ్రిక)లో 75 ఏళ్ల వృద్ధురాలు రాజ్యలక్ష్మికి ఏనాడో ప్రభుత్వం కేటాయించిన చిన్న ఇంటిలో కరెంటు మీటరు పనిచేయడంలేదని చెప్పడంతో రెండు రోజుల కిందట సిబ్బంది మోసపూరితంగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌ను బిగించారన్నారు. ప్రజా ఆందోళన ఫలితంగా అదానీ సిబ్బంది స్మార్ట్ మీటర్‌ను తొలగించి పాతమీటర్‌ని బిగించారని చెప్పారు. రాజ్యలక్ష్మి ఇంటిని బాబూరావు సందర్శించి స్మార్ట్ మీటర్‌కు వ్యతిరేకంగా పోరాడిన రాజ్యలక్ష్మిని అభినందించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలే ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. పాదయాత్రలో సీపీఎం నాయకులు బి.రమణరావు, జాన్సీ, వెంకటరెడ్డి, పీర్ సాహెబ్, సావిత్రి, పిచ్చమ్మ, సుందరామరాజు తదితరులు పాల్గొన్నారు.